క్లుప్తంగా

'స్థానిక' ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

మంచిర్యాలటౌన్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు గ్రామస్థాయి నుంచి కృషి చేయాలని, పార్టీ పదవులతో యువతకు పెద్దపీట వేస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో మంచిర్యాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశాన్ని ఆదివారం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరిగె నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నస్పూర్ మండల అధ్యక్షులు భీమిని రాజేశ్, బొప్పు సుమన్, రామ్‌దేని వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

శ్రీరాంపూర్: ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్లను కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు ఆవిష్కరించారు. శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద ఆదివారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం పోస్టర్లను ఆవిష్కరించారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు అప్పారావు, శంకర్, సుధాకర్, రాంబాబు, సురేశ్, రాము, సమ్మయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ ఉద్యమం



మాట్లాడుతున్న శ్రీకాంత్

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ దశలవారీ ఉద్యమాలు చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. స్థానిక సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమొక్రసీ కార్యాలయంలో ఆదివారం పీడీఎస్‌యూ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిల స్కాలర్‌షిప్ విడుదల చేయాలని సూచించారు. కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, జిల్లా నాయకులు కార్తీక్, శశికుమార్ పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాల ప్రచారం

దండేపల్లి: జూలై 10న గురు పౌర్ణమిని పురస్కరించుకొని 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక' లక్సెట్టిపేట, కొడిమ్యాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కొర్విచెల్మ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆర్.రాజు, రాకేష్, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



అగ్నిగుండం దాటుతున్న కర్బలసవారీ

జన్నారం/నెన్నెల: మొహర్రం వేడుకలను జన్నారం, నెన్నెల మండలాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీరీలను ఊరేగించారు. సవారీ బంగ్లాల ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టు భక్తులకు కాళ్లకు గజ్జలు కట్టుకొని డప్పుచప్పుళ్ల మధ్య లయబద్ధంగా అసైదుల్లా అంటూ పాటలు పాడుతూ ఆడిపాడారు. పీరీలకు సబ్జా ఆకు పూల దండలు వేసి మలీద ముద్దలు, కుడకలు, షర్బత్‌ను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు వేల సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు.

చెట్ల పొదల తొలగింపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆదివారం హాజీపూర్ పోలీసులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో చెట్లు, ముళ్ల పొదల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి నుంచి నర్సింగాపూర్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు, ముళ్ల పొదలు తొలగించారు. కార్యక్రమంలో హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్, మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, ఎస్సై చాంద్‌పాషా, హెడ్ కానిస్టేబుళ్లు శేఖర్, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రాజేందర్, శ్రీనివాస్‌లు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త రిక్షాలు నిరుపయోగం



భీమారం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి కేంద్రప్రభుత్వం కేటాయించిన ఆరు చెత్త రిక్షాలు నేడు నిరుపయోగంగా మారాయి. ట్రాక్టర్ల వినియోగంతో రిక్షాలు మూలకుపడ్డాయి. ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన రిక్షాలు నడపించకుంటే వాటిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెట్టాల్సి ఉండగా, మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై నిలిపివేసి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. దీనిపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

భక్తులకు ఇక్కట్లు..!



కోటపల్లి: తొలి ఏకాదశి పండగను పురస్కరించుకొని పార్‌పల్లి గోదావరి నది సమీపంలో స్నానమాచరించేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. పార్‌పల్లి ఎర్రాయిపేట గ్రామ శివారులోని గోదావరి నది వద్ద ఇసుక క్వారీలు ఉండగా, గోదావరి నదిలోకి వెళ్లకుండా నదికి వెళ్లే దారిలో గుంతలను తవ్వించారు. దీంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన చిన్నారులు, వృద్ధులు గుంతలను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా గోదావరి నదిలో ప్రమాదాలు జరిగి మరణించడంతో అధికారులే ఈ చర్యలకు పూనుకున్నారా? లేక కాంట్రాక్టర్ ఇసుక క్వారీలోకి ఎవరూ రాకుండా ఉండేందుకు తవ్వించారా అనేది తెలియాల్సి ఉంది.

రిపేర్‌కు క్యూ..!



బెల్లంపల్లి: వానాకాలంలో పంటల సాగు మొదలైంది. తొలకరి వర్షాల ఆరంభంతో పత్తి విత్తనాలు విత్తుకోవడంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మొక్కలు ఏపుగా ఎదుగుతున్నాయి. ఎదుగుతున్న పత్తి పంటకు చీడపీడలు ఆశించే అవకాశాలు మెండుగా ఉండటంతో రైతులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. చీడపీడల నివారణ కోసం క్రిమి, రసాయనిక మందులను మొక్కలపై పిచికారీ చేయడానికి మూలకు ఉంచిన పాత స్ప్రేయర్లను బెల్లంపల్లిలో ఉన్న రిపేర్ షాపులకు మరమ్మతుకు తీసుకొస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, వేమనపల్లి, కన్నెపల్లి మండలాల రైతులతోపాటు బెల్లంపల్లి మండల రైతులు రోజువారీగా స్ప్రేయర్లతో రిపేరు షాపు వద్ద బారులు తీరుతున్నారు. కూరగాయల మార్కెట్‌కు వెళ్లే మార్గంలో బెల్లంపల్లి బస్తీలో ఉన్న రెండు షాపుల్లో మరమ్మతులకు వచ్చిన స్ప్రేయర్లు కిటకిటలాడుతున్నాయి.

పేరులోనే హైటెక్..

- స్లమ్‌ను తలపిస్తున్న కాలనీ
- రోడ్లపై పారుతున్న డ్రెయినేజీలు..
- గుంతలమయంగా రోడ్లు..
- జిల్లాలోనే విలువైన భూములు ఇక్కడే..
- అయినా సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం



హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్డు నంబర్ 26లో ఇళ్ల ముందు నిలిచిన డ్రెయినేజీ నీరు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీ పేరుకు తగ్గట్టు ఆధునిక సౌకర్యాలతో ఉండాల్సినప్పటికీ గతుకుల రోడ్లు, డ్రెయినేజీ నీరు పారడం వంటి సమస్యలతో దయనీయ స్థితిలో ఉంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ ఈ కాలనీలో అభివృద్ధి, పారిశుద్ధ్యం వంటి కనీస సౌకర్యాలు అందడం లేదు. రోడ్లపై మురుగు నీరు నిరంతరం పారుతూ, వర్షాకాలంలో వర్షపు నీటితో కలిసి రోడ్లు నడవడానికి కూడా వీలులేని స్థితికి చేరుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో చిన్నారులు బడికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు కాలనీలోకి రాకపోవడంతో విద్యార్థులు బస్టాప్‌కు చేరుకోలేని దుస్థితి నెలకొంది.

అత్యధిక మార్కెట్ విలువ..

మంచిర్యాల జిల్లాలో ఇంటి స్థలాలకు అత్యధిక మార్కెట్ విలువ కలిగిన ప్రాంతంగా హైటెక్‌సిటీ కాలనీ నిలుస్తోంది. గజానికి రూ.6,100, అపార్ట్‌మెంట్‌లలో చదరపు గజానికి రూ.2,500గా మార్కెట్ విలువ ఉంది. ఈ కాలనీలో 1,000కి పైగా ఇళ్లు, 50కి పైగా అపార్ట్‌మెంట్‌లు, 1,500కుటుంబాలు, 5,000కు పైగా జనాభా ఉన్నప్పటికీ, కార్పొరేషన్‌కు అత్యధిక పన్ను చెల్లించే ఈ కాలనీకి కనీస మౌలిక సౌకర్యాలు అందడం లేదు. ఈ పరిస్థితి కాలనీవాసులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.



కాలనీలో నిలిచిన డ్రెయినేజీ నీరు



కాలనీలోని రోడ్డు నంబర్ 27లో..

డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణలో వైఫల్యం..

హైటెక్‌సిటీ కాలనీ ఏర్పాటు సమయంలో వెంచర్ యజమానులు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించినప్పటికీ, దాని నిర్వహణ బాధ్యత కార్పొరేషన్‌దే. అయినప్పటికీ డ్రెయినేజీ లీకేజీలను సరిచేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. రోడ్లపై మురుగునీరు నిలిచి, గుంతలతో నిండిపోయిన రోడ్లు కాలనీ దుస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి కార్పొరేషన్ చర్యలు తీసుకోకపోవడం వినియోగదారుల ఆగ్రహానికి కారణమవుతోంది.

వీధి దీపాలు, భద్రతా సమస్యలు..

కాలనీలో వీధి దీపాలు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల రాత్రివేళల్లో వాహనదారులు గుంతలు కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనంగా, మురుగు నీరు నిలిచిన ప్రాంతాల్లో పాముల సంచారం ఉండటంతో నివాసితులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యలు కాలనీవాసుల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి, మౌలిక సౌకర్యాల కొరత వారి జీవన నాణ్యతను దిగజార్చుతోంది.

కార్పొరేషన్ దృష్టి సారిస్తే..

హైటెక్‌సిటీ కాలనీవాసులు కార్పొరేషన్ అధికారులు తమ సమస్యలపై దృష్టిసారించి, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రోడ్ల మరమ్మతు, డ్రెయినేజీ వ్యవస్థ పునరుద్ధరణ, వీధి దీపాల సమర్థ నిర్వహణ, పారిశుద్ధ్యం మెరుగుదల వంటి చర్యలు అత్యవసరమని వారు పేర్కొంటున్నారు. అత్యధిక పన్ను చెల్లించే కాలనీకి కనీస సౌకర్యాలు కూడా అందకపోవడం అన్యాయమని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల అభివృద్ధితో మార్పుతీసుకొస్తా



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, కలెక్టర్ కుమార్ దీపక్

- మంత్రి వివేక్ వెంకటస్వామి

కోటపల్లి: కోటపల్లి మండలాన్ని అభివృద్ధి చేసి మార్పు తీసుకొస్తానని కార్మికశాఖ, మైనింగ్ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కోటపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు విడతల వారీగా అందజేస్తామని, వచ్చే సంవత్సరంలో మరో 3వేల ఇళ్లు ఇస్తానని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మండలంలో మురుగు కాల్వలు, సీసీ రోడ్లుతో అంతర్గత రోడ్లు పూర్తి చేశామని, పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనతో మెరుగైన విద్యను అందిస్తున్నామని, విద్యార్థులు తాగేందుకు పాఠశాలలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఏర్పాట్లు చేశామన్నారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి చెన్నూర్‌కు ఐదు బస్సులు వేయించినట్లు తెలిపారు. మండలంలో అటవీ అనుమతులతో చాలా వరకు రోడ్లు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు సౌకర్యాలు ఎక్కడెక్కడ అవసరమో దృష్టిసారించి త్వరలోనే అనుమతులు తీసుకొచ్చి పూర్తయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ ఒక్క డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని, కాళేశ్వరం కమీషన్లకే సరిపోయిందని, తెలంగాణకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఇసుక వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావాలనే అక్రమంగా ఇసుక రవాణ జరగకుండా కట్టడి చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు కావాలనే ఫేక్ న్యూస్‌లు పెడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మొక్క నాటారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, డీఆర్‌డీవో కిషన్, ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ బన్సీలాల్, దేవేందర్‌రావు, ఎస్సై రాజేందర్, ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదివారం మంత్రి వివేక్ వెంకటస్వామికి మండల కాంగ్రెస్ నాయకులు అన్నమొల్ల అశోక్ వినతిపత్రం అందజేశారు. అదనపు భవనం తో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు.

చెన్నూర్: పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అన్వర్ విద్యుత్ షాక్ తగిలి గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్వర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. గాయాలు తగ్గే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూషణ్‌శర్మ, పాతర్ల నాగరాజు, మహేశ్‌లు పాల్గొన్నారు. అనంతరం తొలి ఏకాదశి సందర్భంగా మదనం పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలకు తొలి ఏకాదశి, మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ బాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ దేవేందర్‌రావు, మదనం పోచమ్మ ఆలయ ఈవో రవి, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలని ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం రామకృష్ణాపూర్, మందమర్రి పట్టణాల్లో మోటార్‌బైక్ ర్యాలీ చేపట్టారు. రామకృష్ణాపూర్‌లో యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, మందమర్రిలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను కేంద్రం వెంటనే సవరించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలన్న ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రామగిరి రామస్వామి, ఐలయ్య, అల్లి రాజేందర్, దూలం శ్రీనివాస్, గందం రవి, రమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జూలై 9న జరిగే సమ్మెలో జిల్లాలోని హమాలీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాశ్ పిలుపునిచ్చారు. హాజీపూర్, దొనబండ, గుడిపేటలో ఉన్న రైస్‌మిల్లులు, మార్కెట్ హమాలీలతో కలిసి ఆదివారం సమ్మె కరపత్రాలు, బుక్‌లెట్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లుల యూనియన్ కార్యదర్శి చిన్నయ్య, హమాలీ నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు ఏఐకేఎంఎస్ మద్దతు

దండేపల్లి: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలిచ్చిన సమ్మె పిలుపునకు అఖిల భారత రైతు కూలీసంఘం (ఏఐకేఎంఎస్) సంపూర్ణ మద్దతిస్తుందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ తెలిపారు. సమ్మెలో కార్మికులు, గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజలు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పట్టాలివ్వాలి

నెన్నెల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ఆదివాసీ నిరుపేదలకు వెంటనే పట్టాలివ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. నెన్నెలలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని కుశ్నపల్లి, ఖర్జీజంగాల్‌పేట, గుండ్లసోమారం, బోగంపల్లి, నెన్నెల, కోణంపేట, బొప్పారం, నార్వాయిపేట, కొత్తూర్, పొట్యాలలో సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. 49జీవో పేరుతో ఆదివాసీల సాగును అడ్డుకుంటూ అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 49జీవోను రద్దు చేసి ఆదివాసీలకు పట్టాలు చేయాలని కోరారు. ఈ నెల 14న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే ధర్నాలో వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు, రైతు కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంబి బాపు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించి ఏకగ్రీవంగా కమిటీ సభ్యులను ఎన్నుకోగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా కిషన్‌రావు, జనరల్ సెక్రటరీగా చంద్రమౌళి, వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణ, ట్రెజరర్ రాజనర్సు, జాయింట్ సెక్రటరీగా నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాధాకృష్ణ, ఈసీ సభ్యులుగా ప్రతాప్‌రావు, ఎం.సత్యనారాయణ, వి.లక్ష్మీనారాయణ రావు, బి.లక్ష్మీ నారాయణ, కొండపాక సత్తయ్య, ఎస్.ప్రశాంత్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

రామాలయ కమిటీ చైర్మన్ రాజీనామా

జన్నారం: శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ నిర్వహణలో రాజకీయం చోటు చేసుకుంది. కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా వస్తున్న ఆరోపణల దృష్ట్యా ఆదివారం నిర్వహించిన ఆలయ కమిటీ సమావేశంలో చైర్మన్ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు ఆలయ కమిటీ ట్రస్ట్ చైర్మన్ మిక్కిలినేని రాజశేఖర్ తెలిపారు. ఇప్పటివరకు సహాయ, సహకారాలు అందించిన వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 1గని సర్వే డిపార్టుమెంట్ చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాలలోని కల్వరి యువశక్తి అనాథ, వృద్ధుల, మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఆడేపు రవీందర్, సీనియర్ సర్వే అధికారి ప్రభాకర్, జూనియర్ సర్వే అధికారి మహబూబ్‌ఖాన్, గని మేనేజర్ సతీష్, స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అంకం రాజమల్లు, సభ్యులు కె.రవి, కిష్టయ్య తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కాసిపేట: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్‌ఎఫ్)చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, నాయకులు గోలేటి స్వామి, జనార్దన్‌రెడ్డి తదితరులున్నారు.


'నిరుపేద వైశ్యులకు అండగా నిలుస్తా'

పాతమంచిర్యాల: నిరుపేద ఆర్యవైశ్యులకు అండగా నిలిచి, వారి ఉన్నతికి కృషి చేస్తానని పట్టణ ఆర్యవైశ్యసంఘం నూతన అధ్యక్షుడు కటకం హరీష్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్య భవనంలో నూతన పట్టణ కమిటీ సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వనమహోత్సవం

జన్నారం: మండలంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంఘ భవనం ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొండు జనార్దన్, ప్రధాన కార్యదర్శి రామచంద్రం, జిల్లా కేబినేట్ చైర్‌పర్సన్ మల్లిఖార్జున్, సభ్యులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, నాయకులు

మంచిర్యాలఅర్బన్/పాతమంచిర్యాల/జన్నారం: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, బాలుర సాంఘిక సంక్షేమ వసతిగృహంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో, జన్నారంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో లింగంపల్లి శ్రీనివాస్, చెన్నూరి సమ్మయ్య, శంకర్‌వర్మ, చిప్పకుర్తి శ్రీనివాస్, వినోద్, వంశీ, వెంకటేశ్, కుమార్, చారి, కొండుకూరి రాజు, లింగంపెల్లి రాజలింగం, కె ప్రశాంత్, జంగం రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



చెన్నూర్: విఠలేశ్వరుని పాదుకలతో శోభాయాత్ర

చెన్నూర్: చెన్నూర్ శివాలయం నుంచి గోదావరి ఒడ్డున గల విఠలేశ్వరుని ఆలయం వరకు తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పాండురంగ విఠలేశ్వరుని పాదులతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, విఠలేశ్వరుని ఆలయ నిర్మాణ కర్త శ్రీరాంభట్ల రఘు, విశ్వహిందు పరిషత్ నాయకులు నడిపల్లి లక్ష్మణ్‌రావు, జాడి తిరుపతి, కేవీఎం శ్రీనివాస్, రాజబాపు, సుసర్ల సురేశ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

నెన్నెల/చెన్నూర్/వేమనపల్లి/భీమిని: తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు సందడి చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం తొలి ఏకాదశి నుంచి పండగలు ప్రారంభం కానుండడంతో ఆదివారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చెన్నూర్ శివాలయం, జగన్నాథాలయాల్లో, నెన్నెల మండల కేంద్రంలోని హన్మాన్, గంగాధర దేవాలయాల్లో, వేమనపల్లి శివాలయం, దస్నాపూర్‌లోని అభయాంజనేయ శివపంచాయతన ఆలయాల్లో దేవతామూర్తులకు అభిషేకం, అర్చన, పుష్పాలంకరణ చేశారు. ఆలయాల్లో 24గంటల భజన (ఎక్కహం) కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్‌కు నివాళి



చెన్నూర్: నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

భీమారం/వేమనపల్లి/మంచిర్యాలటౌన్/చెన్నూర్: జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో, చెన్నూర్ అంబేద్కర్ చౌరస్తాలో, భీమారం, వేమనపల్లి మండల కేంద్రాల్లో శ్యామా ప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. జిల్లా కేంద్రంలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, భీమారంలో జిల్లా నాయకులు మాడెం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బోర్లకుంట శ్రీనివాస్, వేమనపల్లిలో మండల అధ్యక్షుడు ఏట మధుకర్, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, చరణ్‌రాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీకాంత్, అజయ్‌కుమార్, లస్మయ్య, అంజి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.